
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.4
ANDHRAJYOTHY

సూర్యాపేట
5
బుధవారం 14 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.50 (310.2522)	68,453	47,347
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.92 (3.67)	793,39	512.82
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.40 (39.66)	39,669	2,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.100 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.170



నిండుకుండలా సాగర్ జలాశయం

» 589.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం » గరిష్ఠ మట్టానికి అరడుగు తక్కువగా నీటినిల్వ

నాగార్జునసాగర్, మేళ్లచెర్వు, కేతేపల్లి, ఆగస్టు 13: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటినిల్వతో నిండుకుండను తలపిస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 589.50అడుగులు (310.2522 టీఎంసీలు)ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070 టీఎంసీలు) కాగా ఆ ప్రాజెక్టుకు 77,598 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో మంగళవారం సాయంత్రానికి 881అడుగులుగా (193.4090 టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,453 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 589.50 అడులకు చేరుకుంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 7,086 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,629 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,347 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ఎగువ నుంచి 68,453 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

సాగర్ ప్రధాన డ్యాం సమీపంలో మొసలి

సాగర్ ప్రధాన డ్యాం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం మొసలి కనిపించింది. ప్రధాన డ్యాం వద్ద కంట్రోల్ రూం లో ఉన్న సీసీ టీవీలో టన్నెల్ వద్ద మొసలి కదలికలను గమనించారు. వారం రోజులుగా ఎగువ నుంచి భారీ వరదలు రావడంతో మొసళ్లు వచ్చి ఉంటాయని అధికారులు తెలిపారు. పర్యాటకులు ఎవరూ నదిలోకి దిగవద్దని, మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



పులిచింతల ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు వద్ద జల విద్యుత్ కేంద్రం నుంచి 2,400 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 40 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175అడుగులు (45.77టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 170.40 అడుగులుగా (39.66 టీఎంసీలు) ఉంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 39,669 క్యూసెక్కుల వరద వస్తుండగా, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 2,400 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నల్లగొండ జిల్లా కేతేపల్లి సమీపంలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి 793.39 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 641.92 అడుగులు (3.67 టీఎంసీ) ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి, ఎడమ కాల్వల కు 256.41 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 13: అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 571 పాఠశాలల్లో రూ.20.40కోట్ల పనులకు రూ.5.01కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ, ఆర్‌వో ప్లాంట్ల ఏర్పాటు పనులు ప్రారంభించామన్నారు. మైనర్ మరమ్మతులకు డీఎంఎఫ్‌టీ నిధులు ద్వారా సుమారు రూ.7కోట్లు మంజూరు చేశామన్నారు. పనులు పూర్తయిన చోట వెంటనే ఎంబీలు ఇవ్వాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వనమహోత్సవలో భాగంగా వివిధ శాఖలకు ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మూడు లేన్ల ప్లాంటేషన్ ఏర్పాటు చేసి వనమహోత్సవం విజయవంతం చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కింద జిల్లాలో చేపట్టిన పనులు సంతృప్తిగా ఉన్నాయని, పంచాయతీరాజ్‌శాఖ అధికారులను సమన్వయంతో విజయవంతం చేశారన్నారు. ఇంకుడు గుంతలపై మండలాల వారీగా నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో అప్పారావు, సీపీవో కిషన్, డీఈవో అశోక్, డీపీవో యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

అనంతగిరి: మండల కేంద్రంలో 20 ఎకరాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం భవన నిర్మాణ పనులను ఆయన తనిఖీచేసి మాట్లాడారు. హాస్టల్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. అనంతరం మండలంలో ధరణి సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వద్దకు నేరుగా వెళ్లి, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తోందని దరఖాస్తుదారులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయిగౌడ్, ఆర్ఐ రాజేష్, తదితరులు ఉన్నారు.

అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలి



పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, ఆగస్టు 13: స్వాతంత్ర్య వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కమాండర్‌గా జిల్లా ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ఆయన వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, ఏఆర్ (అడ్మిన్) ఆర్ఐ నారాయణరాజు, పరేడ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రాజధానికి నీటి సరఫరా భారం

ఏఎమ్మార్పీపైనే



సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు పనులు గడువుకు మించి జాప్యమవుతుండడంతో హైదరాబాద్ మహానగరానికి మరో మూడేళ్ల పాటు ఏఎమ్మార్పీ (ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు)నుంచే తాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగి, రిటైనింగ్ వాల్ కూలడంతో ఈ పనులు జాప్యం కానుండగా, రాజధానికి నీటిసరఫరా భారం ఏఎమ్మార్పీపైనే కొనసాగనుంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

» మరో మూడేళ్లు ఇదే పరిస్థితి » ప్రమాదంతో సుంకిశాల పనుల్లో జాప్యం » అప్పటి వరకు ఏఎమ్మార్పీ నుంచే నీటి సరఫరా » రాజధానికి తాగునీటి సరఫరాతో పూర్తి ఆయకట్టుకు అందని సాగునీరు

ఏఎమ్మార్పీపై హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే భారం తగ్గించడంతో పాటు, వేసవిలో నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్‌స్టోరేజీకి నీటిమట్టం పడిపోయినప్పుడు నీటి సరఫరాలో ఇబ్బందిలేకుండా ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగి, రిటైనింగ్ వాల్ కూలింది. ఈ సంఘటన మొత్తం ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణమైంది. వాస్తవానికి ప్రభుత్వ అంచనా ప్రకారం వచ్చే వేసవి నాటికి కనీసం ఒక్క టన్నెల్ ద్వారానైనా నీటిని అందించేందుకు సిద్ధం చేయాలన్నది లక్ష్యం. కాగా, ఆ దిశగా పనులు కొనసాగిస్తున్న క్రమంలో ప్రమాదం జరగడం, దీనిపై రాజకీయం నెలకొనడంతో ప్రాజెక్టు పనుల్లో అనివార్యంగా జాప్యం తప్పని పరిస్థితి ఏర్పడింది.

2026 వరకు హైదరాబాద్‌కు ఏఎమ్మార్పీ నుంచే నీరు

సుంకిశాల ప్రాజెక్టు కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం 2025 మేనాటికి అందుబాటులోకి రావాల్సి ఉంది. కాంట్రాక్ట్ సంస్థ పేర్కొంటున్న ప్రకారం ఇప్పటివరకు ఇన్‌టేక్‌వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70శాతం, ఎలక్ట్రోమెకానికల్ పనులు 40శాతం మేర పూర్తయ్యాయి. ప్రమాదం జరగడంతో సంపు పనులు మళ్లీ మొదటికొచ్చాయి. దీంతో ఈ పనులన్నీ పూర్తవ్వాలంటే మరో ఏడాది అదనంగా సమయం పడుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అప్పటి వరకు ప్రస్తుతం కొనసాగుతున్నట్లుగానే ఏఎమ్మార్పీ నుంచే హైదరాబాద్‌కు నీటిని అందించాల్సి ఉంటుంది. ఏఎమ్మార్పీలో భాగమైన ఏకేబీఆర్ నుంచి ప్రస్తుతం రోజుకు 525 క్యూసెక్కుల చొప్పున మూడు పైప్‌లైన్ల ద్వారా హైదరాబాద్‌కు నీటిని అందిస్తున్నారు. వేసవిలో సాగర్‌లో నీటిమట్టం తగ్గితే ప్రత్యేకంగా 10 భారీ మోటర్లు ఏర్పాటు చేసి నీటిని తోడి పంపింగ్ చేయాలి. 2021లో, 2024లో రెండు పర్యాయాలు ఈ పరిస్థితి కొనసాగింది. సుమారు 16ఏళ్ల నుంచి హైదరాబాద్‌కు సాగర్‌నీటిని అందిస్తున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లాలోని ఏఎమ్మార్పీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేకపోయారు. సుంకిశాల అందుబాటులోకి వస్తే ఏఎమ్మార్పీకి ఆ భారం తప్పుతుందని భావించినా, అనూహ్యంగా ప్రాజెక్టులో ప్రమాదంతో వివాదంలో చిక్కుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇంకోవైపు ఏఎమ్మార్పీ, సుంకిశాల వంటి ఎత్తిపోతల పథకాలతో అవసరం లేకుండా గ్రావిటీతో నల్లగొండ జిల్లాకు నీటిని అందించే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించినా,ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడేళ్లు పట్టనుంది. మొత్తంగా నల్లగొండ జిల్లాలో దాదాపు 2.60లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందించాల్సిన అనివార్య పరిస్థితి ఏఎమ్మార్పీకి మరో మూడేళ్ల పాటు తప్పదు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు నిర్వహణలో ఇబ్బందుల్లేకుండా చూడాలనే సూచనలు సర్వత్రా వస్తున్నాయి.

కొనసాగుతున్న సివిల్ పనులు

సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు వద్ద సంపు పనుల్లో బ్రేక్ పడినా, ఇతర పంపుహౌస్ నిర్మాణపనులు, పంప్ హౌస్ స్ట్రక్చర్ పనులు, పంపింగ్ మెయిన్ పనులు, సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తర భారతదేశానికి చెందిన దాదాపు 300 మందికి పైగా కార్మికులు, మెగా కంపెనీకి చెందిన ఇంజనీర్లు, నాన్‌టెక్నికల్ సిబ్బంది ఇక్కడ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు వేగంగా సాగినా, కీలకమైన సంపు పనులు పూర్తయితే తప్ప ప్రాజెక్టు కొలిక్కిరాని పరిస్థితి ఉంది.



పనులు సాగాలంటే సాగర్‌లో

నీటిమట్టం తగ్గాల్సిందే..

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఆనుకొని సుంకిశాల వద్ద ఇన్‌టేక్‌వెల్ నిర్మిస్తున్నారు. ఇక్కడ సంపు, మూడు టన్నెళ్ల నిర్మాణాలతో పాటు, పంపుహౌస్, పంపుహౌస్ సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తున్నారు. అందులో టన్నెళ్లు, వాటిపై సైడ్‌వాల్స్ నిర్మిస్తున్నారు. మొత్తం రిజర్వాయర్ లెవల్‌కు సమాంతరంగా 180 మీటర్ల ఎత్తు, ఆపైన సంపుఫ్లోర్ లెవల్‌కు మరో 137మీటర్ల ఎత్తుకు నిర్మాణాలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ప్రమాదంలో సైడ్‌వాల్ కూలిపోవడంతో ఆ గోడను పూర్తిగా దిగువనుంచి మళ్లీ నిర్మించాల్సి ఉంటుంది. ఆ ఒక్క గోడ నిర్మాణమే గాక, ప్రమాదంలో టన్నెల్‌కు రిజర్వాయర్ వైపున ఉన్న గేటు తెరుచుకోవడంతో సంపులోకి నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిని తీయాలంటే సాగర్ రిజర్వాయర్‌లో ఈ గేటు లెవల్‌కంటే దిగువకు నీటిమట్టం పడిపోవాలి. అంటే దాదాపు డెడ్‌స్టోరేజీ పరిస్థితి ఏర్పడాలి. నిర్మాణ సంస్థ ప్రతినిధులు రెండు నెలల్లో ఈ సంపులో కూలిన సైడ్‌వాల్ పనులు ప్రారంభిస్తామని చెబుతున్నా, వాస్తవానికి రిజర్వాయర్‌లో నీరు తగ్గాలంటే కనీసం ఫిబ్రవరి వరకు ఆగాలి. డెడ్‌స్టోరేజీకి నీరు పడిపోకపోయినా, నదిలో టన్నెల్స్ వైపునీరు రాకుండా మళ్లించే నిర్మాణం చేపట్టాలన్నా కనీస నీటిమట్టానికి చేరువవ్వాలి. అది జరగాలన్నా కనీసం ఫిబ్రవరి వరకు వేచి ఉండకతప్పదని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంకూడా సంపు పనుల వేగవంతాన్ని ప్రభావితం చేస్తుందని, మొత్తంగా ఈ వివాదమంతా ముగిసి, పనులు ముందుకు సాగేందుకు వేసవి వరకు వేచి ఉండక తప్పని పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో కోటాచలం

సూర్యాపేటరూరల్, ఆగస్టు 13: సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. సీజనల్ వ్యాధులపై మంగళవారం మండల పరిధిలోని బాలెంల మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో కళాశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు స్థావరాలను ఏర్పాటు చేసుకొంటాయన్నారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా ప్రబలే అవకాశం ఉందన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల పలు వ్యాధుల బారినపడతారని, స్వచ్ఛమైన నీరు తాగాలని, ఎల్లప్పుడూ చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మణిరత్నం, ప్రిన్సిపాల్ నీలా, సైదమ్మ, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

హుజూర్‌నగర్: అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపాలపురంలో రెండో రోజు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గ్రామంలో విషజ్వరాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దన్నారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నామని, డెంగీ ప్రబలకుండా ప్రజలు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడికల్ అధికారులు గ్రామస్థులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామంలో రెండురోజుల పాటు తొమ్మిది బృందాలు రక్త నమూనాలు సేకరించాయన్నారు. పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశామన్నారు. అనంతరం గ్రామంలో ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, కల్యాణి, నాగసైదులు, ఝాన్సీ, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

వసతుల లేమి లేకుండా సాయం

సుధాకర్ పీవీసీ ఇండస్ట్రీస్ చైర్మన్ మీల జయదేవ్



అర్వపల్లి జడ్పీహైస్కూల్‌కు బెంచీలు అందజేస్తున్న మీలా మహదేవ్

నాగారం, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వసతుల లేమితో ఉండకూడదనే భావనతో పాఠశాలల అభివృద్ధికి సుధాకర్ పీవీసీ ఇండస్ట్రీస్ సహకరిస్తోందని చైర్మన్ మీల జయదేవ్ అన్నారు. మంగళవారం నాగారం మండలంలోని ఫణిగిరి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50వేల విలువైన బీరువాలు, గ్రీన్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, ఐరన్‌రాక్స్‌ను అందజేశారు. అదేవిధంగా అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుధాకర్ పీవీసీ ఇండస్ట్రీస్ చైర్మన్ మీలా మహదేవ్ రూ.40వేల విలువైన గ్రీన్ బోర్డులు, బెంచీలు, బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలకు అన్నివిధాలా సహాయం అందజేస్తామన్నారు. ఫణిగిరి పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన సుధాకర్ ఇండస్ట్రీస్‌కు కృతజ్ఞత లు తెలిపారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు కంప్యూట ర్, ప్రింటర్‌ను త్వరలో అందజేస్తానని జయదేవ్ ప్రకటించారు. కార్యక్రమాల్లో ఎంఈవో బాలునాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుండా రమేష్, సుధాకర్ పీవీసీ అకౌంట్స్ మేనేజర్ ఆమంచి అచ్యుతశర్మ, అర్వపల్లి హెచ్‌ఎం విజయలక్ష్మి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మఠంపల్లి, ఆగస్టు 13: రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరొందిన మట్టపల్లి లక్ష్మీనృసింహుడి మహాక్షేత్రంలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య, శ్వాశత కల్యాణాన్ని పండితులు వేద మంత్రోచ్ఛరణాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో గణపతి పూజ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన, మంగాల్యధారణ తలంబ్రాలతో నిత్య కల్యాణం నిర్వహించారు. భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మట్టపల్లిరావు, చెన్నూరి విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రీ, శేషగిరిరావు, రాజేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో మండల డప్పు కళా బృందం



గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొననున్న సతీష్ డప్పు కళా బృందం

గరిడేపల్లి, ఆగస్టు 13: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ డప్పు కళా బృందం, మహిళా డప్పు కళాకారులు పాల్గొనే అవకాశం దక్కిందని డప్పు కళాకారుడు సతీష్ తెలిపారు. స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, భాషా సాంస్కృతిక శాఖ డాక్టర్ మామిడి హరికృష్ణ సహకారంతో అందె మ్యూజిక్ అకాడమీ అందె భాస్కర్ ఆధ్వర్యంలో ఈ అవకాశం రావడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తాము రాష్ట్ర రాజధానిలో డప్పు కొట్టడం ఆనందంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



క్రికెట్ పోటీలో బ్యాటింగ్ చేస్తున్న జడ్జి శ్యాంకుమార్

హుజూర్‌నగర్, ఆగస్టు 13: పట్టణంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు రెండోరోజు మంగళవారం రసవత్తరంగా సాగాయి. సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ బౌలింగ్ చేసి క్రీడాభిమానులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలపై ప్రతీ ఒక్కరికి ఆసక్తి ఉండాలన్నారు. న్యాయవాదులు వృత్తితో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో సాముల రామిరెడ్డి, జక్కుల వీరయ్య, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నట్టి సత్యనారాయణ, చల్లా కృష్ణయ్య, రవికుమార్, లతీఫ్, కాలువ శ్రీనివాస్, జక్కుల నాగేశ్వరరావు, యాదగిరి, సురేందర్, నర్సింహారావు, సుందరరాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

గుర్రంపోడు, ఆగస్టు 13: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆమలూరు గ్రామంలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా రామ చంద్రం (43) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామచంద్రంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళపై దాడి .. నిందితులపై హత్యాయత్నం కేసు

చిలుకూరు, ఆగస్టు 13: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో మహిళపై మంగళవారం కత్తితో దాడి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన దొంగరి సంధ్య తన తల్లిగారి గ్రామమైన ఆర్లెగూడేనికి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆరె.సైదాబాబు సంధ్యను వెనుక నుంచి వచ్చి కత్తితో దాడిచేశాడు. దీంతో చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంధ్య తండ్రి ఆరె బసవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెల మృతి

శాలిగౌరారం, ఆగస్టు 13: కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకుల పహాడ్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన మేకల కాపరి గోళ్ల సైదులు సోమవారం రాత్రి గొర్రెలను మందలో తోలాడు. అయితే అర్ధరాత్రి వేళ కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.50వేల విలువైన గొర్రెలు మృతి చెందాయని బాధితుడు సైదులు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

రామన్నపేట, ఆగస్టు 13: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల గ్రామానికి చెందిన బిజ్జాల రాంబాబు తన కారులో రూ.10వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం



అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న తిరుమల్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 13: తెలంగాణ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన ఎన్ఆర్ఐ, వ్యాపారవేత్త మునుకుంట్ల తిరుపతిరెడ్డి అన్నారు. అమెరికాలో వ్యాపారవేత్తగా కొనసాగుతున్న మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీఎంతో మాట్లాడినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల తరఫున సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులు పూర్తిచేసి నిధులు కేటాయించాలని, అందుకుగాను ఎన్ఆర్ఐలు తమవంతు ఆర్థిక సహాయం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించినట్లు పేర్కొన్నారు. ఆయనవెంట రాష్ట్రానికి చెందిన ఎన్ఆర్ఐలు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

● ఏడుగురు నిందితుల అరెస్టు ● 31తులాల బంగారం, కిలో వెండి, రూ.28వేలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్రపవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ, ఆగస్టు 13: తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందాల సభ్యులు మంగళవారం ఉదయం 9గంటలకు అనిశెట్టిదుప్పలపల్లి ఎక్స్ రోడ్డులో వాహనాలు చేశారు. అదే సమయంలో మిర్యాలగూడ వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరిని ఆపి విచారించారు. ఈ విచారణలో వారు పెద్దసూరారం గ్రామపరిధిలో జూలై 30వ తేదీన పగటిపూట ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వారిని మరింత విచారణ చేయడంతోపాటు స్కూటీని తనిఖీ చేయగా, చోరీ చేసిన బంగారు అభరణాలు, నేరాలకు ఉపయోగించే ఇనుపరాడ్డు లభ్యమయ్యాయి. ఆభరణాలను మిర్యాలగూడలో విక్రయించేందుకు వెళుతున్నట్లు ఇద్దరు నిందితులు తెలిపారు. పట్టుబడిన నేరస్తులు ఇచ్చిన సమాచారంమేరకు ముఠాలోని నలుగురి సభ్యులను చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో, మరో నిందితుడిని వలిగొండలో అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నేరస్తులందరినీ విచారించగా, వారంతా ఒక ముఠాగా ఏర్పడి నల్లగొండ జిల్లాతోపాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలో మొత్తం 12నేరాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ నేరాల్లో మొత్తం రూ.23.53లక్షల విలువైన 31తులాల బంగారం, కిలో వెండి అభరణాలు, రూ.28వేల నగదుతోపాటు నేరాలకు ఉపయోగించిన స్కూటీ, ఇనుపరాడ్డును, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన గుండెబోయిన మహేష్, అదే గ్రామానికి చెందిన గుండెబోయిన మల్లేష్‌తో పాటు నూతి సతీష్, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన బొడిగ అశోక్, చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన భైరబోయిన స్వామి, అదే గ్రామానికి చెందిన గుండెబోయిన చంద్రం, బడే బాలకృష్ణ ఉన్నారు. దొంగల ముఠాలో మరొక సభ్యుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు మినహా మిగతా వారంతా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామానికి చెందిన వారన్నారు. వీరిలో గుండెబోయిన మహేష్, గుండెబోయిన మల్లేష్ మినహా మిగతా వారు పాత నేరస్తులని, వీరిపై గతంలో నల్లగొండ, జనగామ, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. ముఠా సభ్యులను పట్టుకోవడం కీలకంగా వ్యవహరించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, శాలిగౌరారం ఇన్‌స్పెక్టర్ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ డి.రాజు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, లింగారెడ్డి, వహీద్‌పాషా, రాము, శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకోసం
దరఖాస్తుల ఆహ్వానం

● వచ్చే నెల 5వ తేదీలోపు అందజేయాలి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 13: జిల్లాలోని పలు దేవాలయాల్లో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకోసం సెప్టెంబరు 5వ తేదీ వరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ ఏసీ అన్నెపర్తి సులోచన తెలిపారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండలోని తులసీనగర్ భక్తాంజనేయ, శేర్‌బంగ్లా సంతోషిమాతా దేవాలయం, శ్రీనగర్ కాలనీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం, పానగల్లు ఛాయాసోమేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోపలాయపల్లి శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం, చింతపల్లి మండలం మాదనపురం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, కట్టంగూరు మండలంలోని కురుమర్తి కోదండరామచంద్రస్వామి దేవాలయం, మాడ్గులపల్లి మండలం శ్రీవేణుగోణపాలస్వామి దేవస్థానం, కేతేపల్లి మండంల బండే పాలెం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, అన్నెపర్తి గ్రామం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానకు సంబంధించి నూతన మండలి ఏర్పాటు కోసం అర్హులైన వారు దరఖాస్తు హైదరాబాద్ దేవాదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

భువనగిరిలో నకిలీ సర్టిఫికెట్ల తయారీ

● పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు
● హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు అందజేత

భువనగిరి టౌన్, ఆగస్టు 13: నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు అందజేసిన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానిక సమ్మద్ చౌరస్తాలో ఏ టూ జెడ్ కమ్యూనికేషన్ పాయింట్ ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడైన అబ్దుల్లా అలియాస్ గణేష్‌ను, కార్తీక్ బుక్ బైండింగ్ వర్క్స్, రబ్బర్ స్టాంప్స్ నిర్వాహకుడైన మరికుక్కల గిరిని ఆదివారం రాత్రి ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఎస్‌వోటీ పోలీసులు ఆ రాత్రంతా విచారించాక సోమవారం తెల్లవారుజామున భువనగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు సోమవారం అబ్దుల్లా, గిరి దుకాణాలు, ఇళ్లలో తనిఖీలు చేసి పేరు మార్పిడి పత్రాలు, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. లభించిన వివరాల ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే అబ్దుల్లా నకిలీపత్రాలను తయారు చేయగా, అందుకు అవసరమైన స్టాంపులను గిరి తయారుచేశాడని, ఈ ముఠాలో మరికొంతమంది నిందితులు కూడా ఉన్నట్లు ప్రచారమవుతోంది. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరిచాక పూర్తి వివరాలను మీడియాకు తెలియజేస్తామని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల వారికి ఈ ముఠా ఫేక్ సర్టిఫికెట్లను తయారు చేసి ఇచ్చినట్లు ప్రచారమవుతోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చౌటుప్పల్ రూరల్, కొండమల్లేపల్లి, ఆగస్టు 13: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఒకరు, నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో మరొకరు దుర్మరణం చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూఫ్రాన్‌పేట శివారు జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. సీఐ ఆశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బోర్నకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దుడ్డ గురువయ్య(42) హైదరాబాద్ రహమత్‌నగర్‌లో కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తుంటాడు. విజయవాడలో బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి డీసీఎంలో హైదరాబాద్ వస్తుండగా ముందుగా వెళ్తున్న లారీని డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో గురువయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్ కుమార్(38) మండలకేంద్రంలో ఉంటూ తాపిమేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జడ్చర్ల-కోదాడ హైవేపై చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని ఓ దాబా వద్ద భోజనం చేసి రోడ్డుదాటుతుండగా రమావత్ భిక్షనాయక్ అనే వ్యక్తి కారును అతివేగంగా నడిపి రాజ్‌కుమార్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగు

● బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం ● యాదాద్రి భువనగిరి జిల్లా తుమ్మలగూడెంలో ఆటో డ్రైవర్ కుటుంబం దాతృత్వం



రాస అశోక్(ఫైల్)

రామన్నపేట, ఆగస్టు 13: ఓ ఆటోడ్రైవర్ తాను మృతి చెంది, అవయవ దానంతో నలుగురు జీవితాల్లో వెలుగు నింపాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన రాస అశోక్(39) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన తన బావమరుదులతో కలిసి సిద్దిపేటకు డీజే బాక్సుల కోసం వెళ్లి, వాటిని కొనుగోలు చేసి టాటా ఏస్ వాహనంలో తీసుకొస్తుండగా, గజ్వేల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో డ్రైవర్ బ్రేక్ వేశాడు. వాహనం వెనుక భాగంలో కూర్చున్న అశోక్, ఇద్దరు బావమరుదులు ఒక్కసారిగా కిందపడ్డారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా, రాస అశోక్ తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అశోక్ భార్య లలిత, యశోద ఆస్పత్రి ద్వారా అశోక్ నేత్రాలు, కాలేయం, కిడ్నీలు, గుండెను దానం చేశారు. ఇంటిపెద్ద మృతి చెందినా ఆయన అవయవాలు దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపటంతో కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్వగ్రామం తుమ్మలగూడెంలో మంగళవారం అశోక్ అంత్యక్రియలు నిర్వహించారు. అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లానేత పూస బాలకిషన్ కోరారు.

నేటి నుంచి యాదగిరీశుడి పవిత్రోత్సవాలు

● మూడు రోజులపాటు కొనసాగనున్న వేడుకలు ● ఏర్పాట్లు చేసిన దేవస్థాన అధికారులు ● రేపు, ఎల్లుండి నిత్య కల్యాణం, సుదర్శనహోమం రద్దు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 13: యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్ రావు తెలిపారు. ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే పూజల్లో దొర్లిన దోషాల నివారణకు వైష్ణవ, శైవ ఆలయాల్లో పవిత్రోత్సవాలు జరపడం సంప్రదాయమని ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు చెప్పారు. మూడు రోజులపాటుసాగే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ మొదటి రోజు ఉదయం ప్రతిష్ఠామూర్తులకు విశేష అభిషేకం, సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణ, రక్షాబంధనం, 15న రెండోరోజు అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర అధివాసం, మూలమంత్ర హోమాలు, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం సుదర్శన చక్రానికి ఆరాధన, ఆవాహన చేసి అభిషేకించి పూలమాల (ఇది ఏటా ఒకరోజే) వేస్తారు. మూడో రోజైన 16వ తేదీన స్వామివారికి మహాపూర్ణాహుతి, పవిత్ర సమర్పణ, మహాకుంభప్రోక్షణ, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పవిత్రోత్సవాలు పాత గుట్ట ఆలయంలో కొనసాగుతాయన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహోత్సవం, లక్ష పుష్పార్చన, సుదర్శనహోమం రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 13,78,242 ఆదాయం సమకూరింది.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.36,59,950

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు 60 రోజులకు మొత్తం రూ.36,59,950 వచ్చినట్లు ఈవో సిరికొండ నవీన్ కుమార్ తెలిపారు. గుట్టపైన ప్రధానాలయంతోపాటు ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను లెక్కించగా రూ.32,08,490 రాగా, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.4,51,460 కలిపి మొత్తం రూ.36,59,950 సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ డివిజన్ పర్యవేక్షకురాలు బీ.సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువైన స్వామిని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం దర్శించుకున్నారు. పూరోహితులు వల్లూరి నిఖిల్ శర్మ, వల్లూరి భానుప్రకాష్‌శర్మ, ఆలయ ఈవో నవీన్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి తీర్థం అందజేస్తున్న అర్చకుడు

నూతన కార్మిక చట్టాలను రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్, ఆగస్టు 13: నూతన కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికవర్గానికి అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. మళ్లీ 12గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు.. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కార్మికుల హక్కులు సాధించుకోవాలన్నారు. మూడోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్ఛిన్న రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఇందిరాల వెంకటేశర్లు, సత్యానంద్, పాపారావు, ప్రసాద్, పాల్గొన్నారు.

దాతలు ముందుకురావడం అభినందనీయం

నూతన్‌కల్, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండలంలోవని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముత్తయ్య అన్నారు. పాఠశాలకు ప్రముఖుల చిత్రపటాలు, ఆట వస్తువులు, మెడికల్ కిట్టు, గడియారం, మంచినీటి క్యాను, విద్యార్థులకు క్లాత్ బ్యాగ్సుజూజీ గిన్నిస్ బుక్ రికార్డు నాలుగు సార్లు సాధించిన సమాజ సేవకుడు, కవి, పెండెం కృష్ణకుమార్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ముందుకు వచ్చిన కృష్ణకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతరెడ్డి రామలింగారెడ్డి, అయోధ్య, శ్రీనివాస్, ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలపై 17వ తేదీ లోపు సంప్రదించాలి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 13: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఖాళీగా ఉన్న పార్మసిస్ట్ పోస్టులు 4, క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ 1, ల్యాబ్ క్వాలిటీ మేనేజర్ 1, డిస్ట్రిక్ డేటా మేనేజర్ 2, ఏఎన్‌ఎం 2, టీబీహెచ్ 1, రేడియోగ్రాఫర్ 2, సపోర్టింగ్ స్టాఫ్ 1 పోస్టులకు ప్రోవిజినల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 17వ తేదీ లోపు సంప్రదించాలని డీఎంహెచ్‌వో కోటాచలం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయడానికి ఇచ్చిన నోటిఫికేషన్‌ను సంబంధించిన అభ్యంతరాలపై ఈనెల 14, 16, 17 తేదీల్లో లిఖిత పూర్వకంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నెం.9010760324కు సంప్రదించాలన్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళా శక్తి పథకాన్ని మునిసిపాలిటీ పరిధిలోని వివిధ స్వయం సహాయ సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు రుణాల పొంది సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మునిసిపాలిటీ పరిధిలోని తొమ్మిది గ్రూపులకు, అదేవిధంగా 75మందికి వ్యక్తిగతంగా రూ.5.20కోట్ల రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, మెప్మా ఇన్‌చార్జి శ్వేత, సీపీవోలు, ఆర్పీలు, ఏఎల్‌ఎఫ్‌లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువే లక్ష్యం కావాలి

తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, ఆగస్టు 13: విద్యార్థులకు చదువే లక్ష్యం కావాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. భూక్య లక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు భూక్య దామోదర్ మంగళవారం మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థులకు సమకూర్చిన దుప్పట్లను పటేల్ రమేష్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ఇప్పటివరకు కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించడానికి. రూ.10లక్షల వరకు ఖర్చుచేశామన్నారు. విద్యార్థుల చదువు కోసం ఎంతటి సాయమైనా చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్స్, ఆట స్థలం, బాస్కెట్‌బాల్ కోర్టు,


ఆదర్శ పాఠశాలలో విద్యార్థినికి దుప్పటి అందజేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

సీసీ రోడ్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీడీవో పూలమ్మ, డాక్టర్ రాంమూర్తి, దాత భూక్య దామోదర్, ప్రిన్సిపాల్ శంకర్‌నాయక్, హుస్సేనాబేగం పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో వెనుకంజ


నడిగూడెం మండలంలో గీత కార్మికులతో పుస్తకావిష్కరణ చేయిస్తున్న ఖలీల్ అహ్మద్

సూర్యాపేట టౌన్, ఆగస్టు 13: రాష్ట్రంలో మెజార్టీ ప్రజలైన బీసీలు విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకంజలో ఉన్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, రాష్ట్ర నాయకుడు ఖమ్మంపాటి భిక్షపతిగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహం ఎదుట 'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కులగణన చేపడతామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొడోజు సలేంద్రాచారి, పున్నం విష్ణు, అమరవాది శ్రవణ్, బహురోజు ఉపేందర్, మేడారపు బ్రహ్మచారి, జక్కలి రాజు, నర్సింగోజు వీరాచారి, వెంకటాచారి పాల్గొన్నారు.

నడిగూడెం: ప్రముఖ కవి, రచయిత రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' పుస్తకాన్ని నడిగూడెం మండలంలోని బృందావనపురం, నడిగూడెం, సరిపురం గ్రామాల్లో వినూత్నంగా చేతి వృత్తులు, కులవృత్తులు చేసుకుని జీవించేవారితో రిటైర్డు ఉపాధ్యాయుడు ఎస్‌కే ఖలీల్‌అహ్మద్ ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సామాన్యులు, వృత్తిదారులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు అండగా ఉండాలి

సూర్యాపేట సిటీ, కోదాడ రూరల్, ఆగస్టు 13: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో వరద బాధిత కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు కోరారు. వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో కోదాడలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేరళ ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రజలు కూడా ఆర్థికసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి రాములు, జుట్టుకొండ బసవయ్య, దేవర వెంకటరెడ్డి, ముత్యాలు, ఎస్‌కే సైదా, దాసరి శ్రీను, వీరాంజనేయులు, సుంకు శ్రీను, ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ముల్కలపల్లి రాములు, సీపీయం జిల్లా కమిటీ సభ్యులు జుట్టుకొండ బసవయ్య, దేవర వెంకటరెడ్డి, సీపీయం పట్టణ కార్యదర్శి ముత్యాలు, రైతు సంఘం జిల్లా కమిటి సభ్యులు ఎస్‌కె సైదా, సీపీయం పట్టణ కమిటీ సభ్యులు దాసరి


సూర్యాపేటలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

శ్రీను, రైతు సంఘం నాయకులు ఏనుగుల వీరాంజనేయులు, సుంకు శ్రీను, కొండమీది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి


శ్రీనివాస్ మృతదేహం

నూతన్‌కల్, ఆగస్టు 13: పొలం గట్టును తొక్కే సమయంలో పాము కాటు వేయడంతో ఓ రైతు మృతిచెందాడు. మంగళవారం నూతనకల్ మండలంలోకి టీక్యాతండాలో ఈ సంఘటన జరిగింది. నూతన్‌కల్ ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం... టీక్యాతండాకు చెందిన భూక్య శ్రీనివాస్(36) ఇంటి పక్కన ఉన్న తమ పొలంలో సాగు చేసిన నారుమడిని చూసేందుకు తండ్రితో కలిసి వెళ్లాడు. పొలం గట్టుకు ఉన్న రంధ్రంలోకి నారుమడి నీరు వెళ్లడాన్ని గమనించి పూడ్చేందుకు కాలుతో తొక్కాడు. రంధ్రంలో ఉన్న పాము బయటికి వచ్చి శ్రీనివాస్ ఎడమ కాలు పాదంపై కాటు వేసింది. వెంటనే సమీపంలో ఉన్న తండ్రి చంద్రుడికి ఈ విషయం చెప్పాడు. తండ్రి చంద్రుడు పామును చంపి కుమారుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడ రూరల్, ఆగస్టు 13: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ ర్యాంప్ నుంచి కోదాడకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని కోదాడ మండలం చిమిర్యాల క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్ రామిశెట్టి సత్యంబాబు, లారీ యజమాని తోట నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మేళ్లచెర్వు, ఆగస్టు 13: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మగౌరవ సభకు మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సభకు తరలివెళ్లిన వారిలో ఆ సంఘం నాయకులు చింతిరాల బాలచంద్రుడు. చిలక ఏసు, శ్రీకాంత్, కొండలు, భాస్కర్, కల్యాణ్, అజయ్, చింతిరాల రామారావు, సురేందర్, పిచ్చయ్య, శ్రీను, గోపి, నాగేశ్వరావు, భరత్ ఉన్నారు.

నూతన్‌కల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన అనంతరం తొలిసారిగా హైదరాబాద్‌కు మంగళవారం వస్తున్న ఎమ్మా ర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు స్వాగతం పలకడానికి మండలంలోని వెంకేపల్లి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. హైదరాబాద్‌కు వెళ్లినవారిలో పాల్వాయి పరశురాములు, లక్ష్మీకాంత్, దిలీప్‌కుమార్, రాజు తదితరులు ఉన్నారు.

చింతలపాలెం మండల ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

మేళ్లచెర్వు, ఆగస్టు 13: ప్రింట్ అండ్ మీడియా చింతలపాలెం మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యరబోలు నరేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శేషిరెడ్డి,నబీ, రసూల్, రమేష్, కోశాధికారిగా అబ్దుల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మక్బూల్, బాషా, వీరబాబు, మునాఫ్, నవీన్, చంటి, నరసింహారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట కల్చరల్, కోదాడ, అనంతగిరి, అర్వపల్లి, ఆగస్టు 13: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాలయ ఈవో వై. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

●కోదాడలోని గుంటి రంగనాథస్వామి దేవాలయం, తమ్మర గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, తమ్మరబండపాలెం శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అనంతగిరి మండల కేంద్రంలో రఘునాథ రామలింగేశ్వరస్వామి దేవాలయాలకు ధర్మకర్తల మండలికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈవో వెంకటచలపతి తెలిపారు.

●జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని అర్వపల్లి శ్రీయోగనంద లక్ష్మీనర్సింహస్వామి పాలకవర్గానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆసక్తి ఉన్నవారు నల్లగొండలోని దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా అప్పారావు

కోదాడ, ఆగస్టు 13: పట్టణంలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చందా అప్పారావు మంగళవారం బాధ్యతలు స్వీక రించారు. ఈసందర్భంగా ఆయననుఅధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అర్వపల్లి, ఆగస్టు 13: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చునాయక్ అన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామంలోని జడ్పీ పాఠశాల విద్యార్థులకు కల్పించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు స్థావారాలను ఏర్పాటు చేసుకుంటాయన్నారు. దోమలు కుడితే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహాచారి, లలిత, గౌతమి, నాగరాణి, శ్వేత, ఆశాలు పాల్గొన్నారు.

మద్దిరాల: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నగేష్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి మాట్లాడారు. వీధుల్లో చెత్తచెదారం ఉండరాదన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు అరికట్టాలి



సూర్యాపేటలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, మెడికోలు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 13: వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రముఖ వైద్యులు వూర రామూర్తియాదవ్, రమేష్‌నాయక్ అన్నారు. ఇటీవల కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కలకత్తాలో వైద్యురాలిపై దాడి చేసి హత్య చేయడం దారుణమని, దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వెంటనే నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణకు పటిష్టమైన చట్టాలు రావాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆనంద్, రమేష్‌చంద్ర, మెడికోలు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు చిహ్నం జాతీయజెండా

కోదాద, ఆగస్టు 13: దేశ సమైక్యతకు జాతీయజెండా చిహ్నామని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ అన్నారు. మంగళవారం హర్‌ఘర్ తిరంగా జాతీయ పండుగలో భాగంగా పట్టణంలో ఆపార్టీ శ్రేణులు తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించాయి.. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ సమైక్యత, సమగ్రతను చాటేందుకు, దేశ ప్రజలందరూ మతాలు, కులాలకు అతీతంగా త్రివర్ణ పతాకాన్ని ఇంటింటా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవీటి శ్రీనివాసరావు, వంగాల పిచ్చయ్య, కిట్టు, చారి, శ్రీనివాసు, వెంకటేష్, సతీష్, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యంతో నిలిచిన కుక్క పిల్లల ప్రాణాలు

కోదాడ రూరల్, ఆగస్టు 13: పట్టణంలోని బైపాస్ పక్కన మైదానంలో ఏడు పిల్లలతో కుక్క స్థానికులకు కనిపించింది. వాకింగ్‌కు వెళ్లిన ఎల్‌ఐసీ ఏజెంట్ తూమాటి సురేష్‌రెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు పొయిలి కృష్ణయ్య వాటిని గమనించి పక్కనే ఉన్న ప్లాట్‌లోకి తరలించారు. తల్లికి ఆహారం, పిల్లలకు పాలు అందజేశారు. ఓ కుక్క పిల్ల జ్వరంతో కోమాలోకి వెళ్లి మృతి చెందింది. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య సిబ్బందితో మిగిలిన కుక్క పిల్లలకు ప్రథమ చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న స్థానికులు పెంచుకోవడానికి నాలుగు కుక్క పిల్లలను తీసుకువెళ్లారు. మిగిలిన రెండు పిల్లలు, తల్లిని సురేష్‌రెడ్డి తీసుకువెళ్లారు.


కుక్క పిల్లలకు వైద్యం అందిస్తున్న పెంటయ్య



సూర్యాపేట టౌన్: ప్రజాస్వామ్యాన్ని పాతర వేసే నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఏడెల్లి శ్రీకాంత్ అన్నారు. నూతన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఎస్‌ఆర్ సెంటర్‌లో నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్ల సైదులు, శ్రీనివాస్, గాలి రామకృష్ణ, రెడిమల శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

సూర్యాపేట: హర్ గర్ తిరంగా యాత్రలో భాగంగా బుధవారం సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జెండాలతో కొత్త బస్‌స్టేషన్ మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

●ఈ నెల 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో నిర్వహించే పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సక్క కోరారు. ఆత్మకూర్(ఎస్)మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, జానమ్మ, మంగమ్మ, లింగమ్మ, అంజమ్మ, పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్: మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో వాసవీ క్లబ్, సుధాకర్ విజన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎడమచేతి వాటం ఉన్న విద్యార్థులకు విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన ప్యాడ్లు, పెన్నులు, తదితర స్టేషనరీ సామగ్రిని అందజేశారు.

నేరేడుచర్ల: మండలంలోని దిర్శించర్ల గ్రామ ఊర చెరువుకు మంగళవారం రెవెన్యూ, నీటిపారుదల సిబ్బంది మంగళ వారం హద్దు రాళ్ల పాతారు. చెరువు విస్తీర్ణం 111.26ఎకరాలు కాగా, చెరువు భూమిని చుట్టూ ఉన్న రైతులు ఆక్రమించి సాగు చేస్తున్నందున, స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వ రికార్డుల ప్రకారం మండల సర్వేయర్ గాయత్రి ఆధ్వర్యంలో ఏఈ సతీష్ సిబ్బంది సర్వే చేయించి హద్దురాళ్లు పాతించారు.

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వానాకాలంలో మొక్కజొన్న, అపరాల పంటలు, యాజమాన్య పద్ధతుల్లో మెలకువలను శాస్త్రవేత్తలు డి.బద్రు, శ్రీదేవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణసందీప్, ఏఈవో సంధ్య, రైతులు బక్కయ్య, పుష్ప, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ మండలంలోని లింగాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో గార్లపాటి పెద్దచంద్రారెడ్డి, కొన్నె రవి మృతి చెందారు. ఇరువురి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు దొంగిరి గోపి పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డ శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, హరీష్‌కుమారాచార్యులు, శ్రీకాంత్, రాఘవులు, అశోక్, సంతోష్, మురళి పాల్గొన్నారు.

● అంతర్జాతీయ క్రైస్తవ సంఘం నేత అల్లం ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఉపాధ్యాయురాలు ఉమారాణి మృతి బాధాకరమని బిషప్ డాక్టర్ దుర్గం ప్రభాకర్ అన్నారు. హుజూర్‌నగర్‌లో అల్లం ఉమారాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంతాప కార్యక్రమంలో ఊటుకూరి రాజు, దేవసహాయం, ఆమోస్, ఎలీషా, సువార్త, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని గోపాలపురంలో మంచినీటి ఎద్దడి నివారించాలని, విష జ్వరాలను అరికట్టాలని కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు చీకూరి గోవిందరావు కోరారు. గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వెంకన్న, రాము, శ్రీనివాసు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు జిలకర రామస్వామి, గున్‌రెడ్డి సైదిరెడ్డి, చిత్రం విశ్వనాథ్, రెడ్డిపల్లి శ్రీను, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బందం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లమల్కాపురంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

● మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు భూక్య కాంతమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. మంగళవారం అకాల మృతి చెందిన కాంతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోతీలాల్‌నాయక్, బానోతు జగన్‌నాయక్, బాబునాయక్ పాల్గొన్నారు.

పాలకవీడు: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడులను ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు మఒక ప్రకటనలో తెలిపారు. హిందూ దేవాలయాలపై దాడులను భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

కోదాడ: పట్టణంలోని పెద్ద మసీదు దుకాణాల సముదాయానికి వక్ఫ్ బోర్డు నింబంధనల ప్రకారం వేలం పాట నిర్వహించాలని మసీద్ కమిటీని సామాజిక కార్యకర్త సయ్యద్ బషీరుద్దీన్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022లో లోకాయుక్త కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం దుకాణాల సముదాయంలోని మూడవ వంతు దుకాణాలకు ప్రతి సంవత్సరం వేలం పాట నిర్వహించి అర్హులకు కేటాయించాలని కోరారు.

కోదాడ రూరల్: గమనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్, పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న యాచకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు అంకతి అనసూర్య, సంజీవరావు, ఈశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, పార్వతమ్మ పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని 33/11కేఈ నల్లబండగూడెం సబ్ స్టేషన్‌లో బ్రేకర్‌ను మరమ్మతు చేస్తున్నందున దోరకుంట గ్రామం ఫీడర్‌లోని నల్లబండగూడెం, చిమిర్యాల, దోరకుంట గ్రామాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మేళ్ల చెర్వుకు సంబంధించిన కందిబండ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ యర్రవరం ఫీడర్‌లో లైన్ షిఫ్టింగ్ పనులు చేస్తున్నందున ఉదయం 10గంటల నుండి 12 గంటల వరకు యర్రవరం, రామలక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కోదాడ రూరల్: పాఠ్యాంశ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని కొమరబండ తేజ విద్యాలయానికి చెందిన 107మంది విద్యార్థులు, 10మంది ఉపాధ్యాయులు నాగార్జునసాగర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు గోపిరెడ్డి, సౌజన్య పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని పురాతన శ్రీరఘునాథస్వామి ఆలయంలో మంగళవారం మాస కల్యాణం నిర్వహించారు. డేగ కొండయ్య, అరుణ దంపతులు దాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొండపల్లి వాసు, పీఏసీఎస్ చైర్మన్ డేగ బాబు, ఈవో తుమ్మల వెంకటచలపతి, ఓరుగంటి రమేష్, గరిడేపల్లి ఉపేందర్, అర్చకులు రామకృష్ణచార్యులు, రాఘవచార్యులుపాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి దేవాలయం, బస్‌స్టేషన్ సమీపంలోని వీరాంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, సరస్వతి దంపతులు, తుమ్మలపల్లి ప్రవీణ్, దీప్తి దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

తుంగతుర్తి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు, పూర్వ విద్యార్థులు సహకరించాలని ఎంఈవో బోయిని లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బండారంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు రెండు పాఠశాలలకు పూర్వ విద్యార్థి కొరుకొప్పుల నరేష్‌గౌడ్ షూ, టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ం కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్వపల్లి: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నెం.9550475444ను సంప్రదించాలన్నారు.